PRGI No. APTEL/2010/31893

# కొత్త స్వరం

తెలుగు దిన పత్రిక

బుధవారం,
జూన్ 17, 2026

TG & AP

సంపుటి : 16 (Vallume : 16) | సంచిక : 13 (Issue: 13) | పేజీలు : 4 (Pages : 4) | వెల : రూ 2.00/- (Rs : 2.00/-)

## ఫీజుల దోపిడీపై ఏబీవీపీ ఆగ్రహం.. హైదరాబాద్‌లో ఉద్రిక్తత




- ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణకు చట్టం కోరిన విద్యార్థి సంఘం
- విద్యాశాఖ కమిషనరేట్ ముట్టడికి యత్నించిన కార్యకర్తలు
- పోలీసుల అడ్డుకట్టతో స్వల్ప తోపులాట
- పలువురు ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు అదుపులోకి
- పెరిగిన ఫీజులతో తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం

2

## 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'కు గ్రీన్ సిగ్నల్

- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ప్రముఖ రహదారికి ట్రంప్ పేరు
- జూన్ 23న ఘనంగా ప్రారంభానికి ఏర్పాట్లు
- సీఎం రేవంత్‌రెడ్డి, అమెరికా ప్రతినిధుల హాజరు
- ఐటీ, పెట్టుబడి బంధాల బలోపేతమే లక్ష్యమంటున్న సర్కార్
- నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో చర్చ, బీజేపీ అభ్యంతరం



**హైదరాబాద్, జూన్ 16 (కొత్తస్వరం):**

భాగ్యనగరంలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గౌరవార్థం హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఒక ప్రధాన రహదారికి 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా నామకరణం చేయనున్నట్లు ప్రకటించారు. నానక్‌రామ్‌గూడలోని యూఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయానికి సమీపంలోని ప్రస్తుత 'యూఎస్ కాన్సులేట్ రోడ్'ను కొత్త పేరుతో మార్చనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. జూన్ 23న ఈ రహదారి ప్రారంభోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అమెరికా రాయబారి, ఉన్నతాధికారులు, దౌత్యవేత్తలు, ఐటీ రంగ ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉంది. తెలంగాణ ఐటీ రంగానికి అమెరికా అందిస్తున్న సహకారానికి గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. హైదరాబాద్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దే వ్యూహంలో భాగంగా ప్రముఖ రహదారులు, జంక్షన్లకు అంతర్జాతీయ గుర్తింపు ఉన్న వ్యక్తులు, సంస్థల పేర్లు పెట్టే ఆలోచనను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది. అయితే ఈ నిర్ణయం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. రోడ్ల పేర్ల మార్పుపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తుండగా, అంతర్జాతీయంగా హైదరాబాద్ ప్రొఫైల్ పెరగడంలో ఇది సహాయపడుతుందని మద్దతుదారులు అభిప్రాయపడుతున్నారు.



## మెట్రో విస్తరణపై రగడ..

- ఆరోపణలను తిప్పికొట్టిన కిషన్‌రెడ్డి
- తెలంగాణ అభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం
- మెట్రో విస్తరణకు అడ్డంకులు సృష్టించలేదన్న కేంద్ర మంత్రి
- ఐఆర్ఎఫ్‌సీ రుణ ప్రతిపాదనలో సాంకేతిక సమస్యలున్నాయన్న వ్యాఖ్య
- అభివృద్ధిపై తమకు ఎవరూ పాఠాలు చెప్పనవసరం లేదన్న స్పష్టం
- రాజకీయ విమర్శలకంటే సమన్వయంతో ముందుకెళ్లాలని సూచన

2

## ఓటరు జాబితా సవరణపై సీతక్క దిశానిర్దేశం

- బూత్ లెవల్ ఏజెంట్లే ఎన్నికల వ్యవస్థకు వెన్నెముక
- ప్రతి అర్హుడి పేరు జాబితాలో ఉండేలా చూడాలని సూచన
- ఒక్క నిజమైన ఓటరు కూడా తొలగించబడకూడదన్న మంత్రి
- సవరణ ప్రక్రియలో అవకతవకలపై అప్రమత్తంగా ఉండాలని పిలుపు
- ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడాల్సిన బాధ్యత శ్రేణులదే

2



## ఢిల్లీలో భారీ ఉగ్రకుట్ర భగ్నం



- పాక్ లింకులతో పనిచేస్తున్న ఉగ్ర ముఠా గుట్టురట్టు
- స్పెషల్ సెల్ దాడుల్లో ఏడుగురు నిందితుల అరెస్ట్
- డ్రోన్ల ద్వారా ఆయుధాలు, డ్రగ్స్ సరఫరా చేసినట్టు వెల్లడి
- మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టే కుట్రను భగ్నం చేసిన పోలీసులు
- మొబైళ్లు, తుపాకులు, తూటాలు స్వాధీనం

2

## రైతు సంక్షేమంలో ఏపీ దేశానికే ఆదర్శం

- వైసీపీ పెండింగ్ బకాయిలకు కూటమి సర్కార్ పూర్తి చెల్లింపులు
- ధాన్యం బకాయిలుగా రూ.1,674 కోట్లు రైతులకు విడుదల
- ఆత్మహత్య బాధిత కుటుంబాలకు రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియా
- మామిడి, ఉల్లి, పొగాకు, కోకో రైతులకు రూ.588 కోట్ల సాయం
- ఉచిత విద్యుత్, సూక్ష్మసేద్యం, హార్టికల్చర్‌లో ఏపీ అగ్రగామి

2





## బీసీ బాలికల విద్యకు భరోసా


- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- 6 ఎంజేపీ స్కూళ్లను కళాశాలలుగా అప్ గ్రేడ్
- జీవో జారీచేసిన కూటమి ప్రభుత్వం
- ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం
- ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ తరగతుల్లో అడ్మిషన్లు
- ఒక్కో గ్రూపులో 40 మంది విద్యార్థినులకు అవకాశం
- ఎంజేపీ బాలికల స్కూళ్లను కళాశాలలుగా అప్ గ్రేడ్ పై మంత్రి సవిత హర్షం
- సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు

2

## అమరావతి పెట్టుబడులకు.. స్వర్ణావకాశం

**వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని పెట్టుబడిదారులకు సీఎం పిలుపు**

- సింగపూర్ వరల్డ్ సిటీస్ సమ్మిట్‌లో చంద్రబాబు ప్రసంగం
- నాలెడ్జ్, ఫైనాన్స్, హెల్త్ హబ్‌గా అమరావతి రూపకల్పన
- కృష్ణా తీరం వెంట 21 కి.మీ వాటర్‌ఫ్రంట్ సిటీ నిర్మాణం
- టెక్నాలజీ ఆధారిత పాలనపై సింగపూర్ నమూనాల అధ్యయనం



**సింగపూర్, జూన్ 16 (కొత్తస్వరం):**

అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చెందుతున్న రాజధాని అమరావతిలో అపార పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సరికొత్త ఆలోచనలు, వినూత్న ప్రణాళికలతో అమరావతికి రావాలని పెట్టుబడిదారులను ఆయన ఆహ్వానించారు. సింగపూర్ పర్యటనలో భాగంగా 'వరల్డ్ సిటీస్ సమ్మిట్' లీడర్‌షిప్ ప్లీనరీలో పాల్గొన్న సీఎం, "కెన్ స్మార్ట్ సిటీస్ లవ్ హ్యూమన్స్" అంశంపై ప్రసంగించారు. అమరావతిని నాలెడ్జ్ సిటీగా తీర్చిదిద్దుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలను ఆకర్షిస్తున్నామని తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ హబ్, డిజిటల్ మౌలిక వసతులు, గ్రీన్ ఎనర్జీ, అండర్‌గ్రౌండ్ యుటిలిటీస్ వంటి ఆధునిక సదుపాయాలతో రాజధాని నిర్మాణం సాగుతోందన్నారు. స్పోర్ట్స్, ఫైనాన్స్, జస్టిస్, టూరిజం, హెల్త్, మీడియా వంటి విభాగాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. కృష్ణానది ఒడ్డున 21 కి.మీ మేర వాటర్‌ఫ్రంట్ నగరంగా అమరావతి రూపుదిద్దుకుంటోందని, ఇన్నర్–ఔటర్ రింగ్ రోడ్లు, ఐకానిక్ బ్రిడ్జిలు నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని సీఎం వివరించారు. ప్రసంగం అనంతరం సింగపూర్ ఇన్నోవేషన్, టెక్నాలజీ ప్రదర్శనలోని పలు స్టాల్స్‌ను సందర్శించిన సీఎం, పట్టణాభివృద్ధి నమూనాలు, స్టార్టప్ ఆవిష్కరణలు, టెక్నాలజీ ఆధారిత పాలనా విధానాలను పరిశీలించారు.

# తాండూరులో నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి: ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

**తాండూరు, జూన్ 16 (కొత్త స్వరం):**
వ్యవసాయం, గృహ, వ్యాపార, వాణిజ్య అవసరాలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం నియోజకవర్గంలోని విద్యుత్ సరఫరా పరిస్థితులు, సమస్యలపై ఆయన విద్యుత్ శాఖ అధికారులతో దూరవాణి ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఏర్పడిన విద్యుత్ అంతరాయాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో పని చేసి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.



## ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుక అక్రమ రవాణా

ప్రజాసంఘాల ఆరోపణలు



**తాండూరు, జూన్ 16 (కొత్త స్వరం):**
వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ట్రాక్టర్ల ద్వారా అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతోందని జిల్లా సీపీఎం కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ ఆరోపించారు. అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తాండూరు పట్టణంలో ప్రజాసంఘాలు, సీపీఎం ఆధ్వర్యంలో మాధ్యమాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇసుక తరలిస్తున్న పేరుతో గత కొన్ని రోజులుగా తాండూరు పట్టణంలో పెద్దఎత్తున అక్రమ రవాణా జరుగుతోందన్నారు. ఈ రవాణా కారణంగా సీతారాంపేట్‌తో పాటు పలు వార్డుల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రత్యేకంగా రాత్రి వేళల్లో ట్రాక్టర్ల రాకపోకలు పెరగడంతో ప్రజలకు నిద్రాభంగం కలుగుతోందన్నారు. ట్రాక్టర్ డ్రైవర్ల నిర్లక్ష్యంతో ఇప్పటికే తాండూరు పట్టణంలో అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. మంగళవారం జరిగిన ఘటన ఇందుకు నిదర్శనమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు అనుమతించిన పరిమితికి మించి ఇసుక తరలించేందుకు ట్రాక్టర్ డ్రైవర్లు అతివేగంగా వాహనాలు నడుపుతున్నారని ఆరోపించారు. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లోనవడంతో ఇసుక మాఫియా ఆగడాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని విమర్శించారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బుగ్గప్ప, ఉప్పలి మల్కయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రప్ప, కేవీపీఎస్ జిల్లా నాయకుడు రత్నం, సీనియర్ నాయకులు వై. రాములు, అశన్న తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో భారీ ఉగ్రకుట్ర భగ్నం

**పాక్ లింకులతో పనిచేస్తున్న ఉగ్ర ముఠా గుట్టురట్టు**
**స్పెషల్ సెల్ దాడుల్లో ఏడుగురు నిందితుల అరెస్ట్**
**డ్రోన్ల ద్వారా ఆయుధాలు, డ్రగ్స్ సరఫరా చేసినట్టు వెల్లడి**
**మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టే కుట్రను భగ్నం చేసిన పోలీసులు**
**మొబైళ్లు, తుపాకులు, తూటాలు స్వాధీనం**

**న్యూఢిల్లీ, జూన్ 16 (కొత్తస్వరం):**
దేశ రాజధాని ఢిల్లీలో భారీ ఉగ్రకుట్రను పోలీసులు భగ్నం చేశారు. పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ మద్దతుతో కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్ర–నేర ముఠాను ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ గుర్తించి, ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న ఏడుగురిని అరెస్ట్ చేసింది. పాకిస్థాన్‌లో ఉన్న గ్యాంగ్‌స్టర్–టెర్రరిస్ట్ షహజాద్ భట్టి ఆదేశాల మేరకు ఈ ముఠా పనిచేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. పంజాబ్ సరిహద్దుల మీదుగా డ్రోన్ల సహాయంతో ఆయుధాలు, మందుగుండు సామగ్రి, మాదకద్రవ్యాలను దేశంలోకి అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. రద్దీ ప్రాంతాలు, కీలక సంస్థలు, మత ప్రముఖుల నివాసాల వద్ద నిందితులు రెక్కీ నిర్వహించి, ఫోటోలు, వీడియోలను ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లకు పంపినట్లు పోలీసులు తెలిపారు. రాజధానిలో మతపరమైన ఉద్రిక్తతలు సృష్టించడమే వారి ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. అరెస్టయిన నిందితుల నుంచి ఆటోమేటిక్ పిస్టళ్లు, 41 సజీవ తూటాలు, కీలక డేటా ఉన్న 7 మొబైల్ ఫోన్లు, ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గత నెలలో అందిన నిఘా సమాచారంతో టెక్నికల్ సర్వైలెన్స్ చేపట్టిన పోలీసులు మంగళవారం ఏకకాలంలో దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసులో మరింత లోతైన విచారణ కొనసాగుతోంది.

## మెట్రో విస్తరణపై రగడ.. ఆరోపణలను తిప్పికొట్టిన కిషన్‌రెడ్డి

**తెలంగాణ అభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం**
**మెట్రో విస్తరణకు అడ్డంకులు సృష్టించలేదన్న కేంద్ర మంత్రి**

**హైదరాబాద్, జూన్ 16 (కొత్తస్వరం):**
హైదరాబాద్ మెట్రో విస్తరణను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఖండించారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మెట్రో రైలు విస్తరణ విషయంలో కేంద్రం ఎప్పటినుంచో సహకరిస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మెట్రో ఫేజ్–1 అమలుకు కేంద్రం రూ.1,200 కోట్లు అందించిందని, విస్తరణ పనులు వేగవంతం చేయాలని తానే సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్లు తెలిపారు. ఐఆర్ఎఫ్‌సీ ద్వారా రూ.13 వేల కోట్ల రుణ ప్రతిపాదన విషయంలో కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నాయని, వాటిని కేంద్రంతో చర్చించి పరిష్కరించుకోవాల్సిందిపోయి రాజకీయ విమర్శలకు దిగడం సరికాదన్నారు. ఆ సమస్యను తనపై మోపే ప్రయత్నం బాధాకరమని వ్యాఖ్యానించారు. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధిపై తమకు ఎవరూ పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని స్పష్టం చేసిన కిషన్‌రెడ్డి, జహీరాబాద్ ఇండస్ట్రియల్ ప్రాజెక్టు, ఎన్‌టీపీసీ విద్యుత్ ప్రాజెక్టు, ధాన్యం కొనుగోలు వంటి అంశాల్లో కేంద్రం సహకారం అందిస్తోందన్నారు. దిగజారుడు రాజకీయాలకు దూరంగా ఉండి అభివృద్ధి అంశాలపై కేంద్రంతో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

# నూతన విద్యా సంవత్సరానికి ఘన ఆరంభం





## సరస్వతీ శిశు మందిర్‌లో గాయత్రి హోమంతో పాఠశాల పునఃప్రారంభం

**విద్యార్థుల శ్రేయస్సు కోసం గాయత్రి హోమం**
**మంచి విద్యతో పాటు సంస్కారం అవసరమని సూచన**

**ఆదిలాబాద్ జిల్లా, జూన్ 16 (కొత్త స్వరం):**
ఇచ్చోడ మండల కేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో 2026–27 నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా గాయత్రి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు మంచి విద్యతో పాటు చక్కని సంస్కారం అలవరుచుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని, సరస్వతి దేవి, లక్ష్మీ దేవి కటాక్షం ఎల్లప్పుడూ వారిపై ఉండాలని కోరుతూ ఈ హోమం నిర్వహించారు. పాఠశాల నిర్వహణ సభ్యులు, పోషకులు గట్ల శైలజ శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం నూతన విద్యా సంవత్సరం ఆరంభంలో విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు కలగాలని గాయత్రి యజ్ఞం నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు సంతోష్ కుమార్, ఆచార్యులు ఉషారాణి, భారతి, సుజాత, మంజుల, కవిత, సిందుజతో పాటు పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఇసుక అక్రమ రవాణాపై కొరడా



**తాండూరులో మైన్స్, విజిలెన్స్ అధికారుల మెరుపు దాడులు**
**15ట్రాక్టర్లు పట్టివేత..9 టాక్టర్లు సీజ్..**
**రంగంలోకి దిగిన మైన్స్, విజిలెన్స్ అధికారులు**
**యాలాల,తాండూరులో ఇసుక అక్రమ రవాణాకు చెక్..**

**తాండూరు, జూన్ 16 (కొత్త స్వరం) :**
వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాపై మైన్స్, విజిలెన్స్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు.తాండూరు నియోజకవర్గంలో అక్రమ ఇసుక మాఫియాపై మైనింగ్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ శాఖ కొరడా ఝుళిపించింది. ఇందిరమ్మ ఇండ్లు, నేషనల్ హైవే పనుల పేరుతో అక్రమంగా కొనసాగుతున్న ఇసుక రవాణాపై మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించి మొత్తం 15 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుంది. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ డీజీ డి.ఎస్. చౌహన్, హైదరాబాద్ రూరల్ ఎస్పీ అశోక్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు యాలాల, తాండూర్ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టాయి. ఈ సందర్భంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గుర్తించి అడ్డుకున్నారు. విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న డ్రైవర్లు, కూలీలు ట్రాక్టర్లను అక్కడికక్కడే వదిలేసి పరారయ్యారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో 9 ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసిన అధికారులు, మిగిలిన వాహనాల యజమానులు, నిర్వాహకుల వివరాలను సేకరిస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, నేషనల్ హైవే పనుల పేరుతో కొందరు అక్రమంగా ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారని అధికారులు గుర్తించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు. తాండూర్, యాలాల మండలాల్లో గత కొంతకాలంగా విస్తృతంగా కొనసాగుతున్న ఇసుక దందాపై విజిలెన్స్ శాఖ చేపట్టిన ఈ సడెన్ ఆపరేషన్‌తో ఇసుక మాఫియాలో కలకలం రేగింది. భవిష్యత్తులో కూడా అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు.ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని రెండు శాఖల అధికారులు హెచ్చరించారు.

# ఓటరు జాబితా సవరణపై సీతక్క దిశానిర్దేశం

**బూత్ లెవల్ ఏజెంట్లే ఎన్నికల వ్యవస్థకు వెన్నెముక**
**ప్రతి అర్హుడి పేరు జాబితాలో ఉండేలా చూడాలని సూచన**
**ఒక్క నిజమైన ఓటరు కూడా తొలగించబడకూడదన్న మంత్రి**
**సవరణ ప్రక్రియలో అవకతవకలపై అప్రమత్తంగా ఉండాలని పిలుపు**
**ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడాల్సిన బాధ్యత శ్రేణులదే**

**ములుగు, జూన్ 16 (కొత్తస్వరం):**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియలో ఎలాంటి లోపాలు, అవకతవకలు చోటుచేసుకోకుండా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలంగాణ మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు. ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మంత్రి సీతక్క, బూత్ స్థాయి ఏజెంట్లు ఎన్నికల వ్యవస్థకు వెన్నెముక వంటివారని అన్నారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత వారిపైనే ఉందని పేర్కొన్నారు. ఏ ఒక్క నిజమైన ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగించబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల సమస్యలను తెలుసుకుని వారికి అండగా నిలవాలని సూచించారు. తమకు అందించిన హ్యాండ్‌బుక్‌లోని నిబంధనలను పూర్తిగా అధ్యయనం చేసి, సవరణ ప్రక్రియలో పారదర్శకత ఉండేలా పని చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి భంగం కలగకుండా, ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికంగా సాగేందుకు ప్రతి కార్యకర్త బాధ్యతగా వ్యవహరించాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.



## బీసీ బాలికల విద్యకు భరోసా

**అమరావతి, జూన్ 16 (కొత్తస్వరం) :**
బీసీ బాలికల విద్యను ప్రోత్సహిస్తూ కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆరు మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసినట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. విజయనగరం జిల్లాలోని కొత్తవలస (బాలికల), ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోని గోలగముడి, అన్నమయ్య జిల్లాలోని కలికిరి (బాలికల), వైఎస్సార్ కడప జిల్లాలోని ఒంటిమిట్ట (బాలికల), ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు (బాలికల), శ్రీ సత్యసాయి జిల్లాలోని నాసనకోట (బాలికల) ఎంజేపీ గురుకులాల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రారంభమైన నూతన విద్యా సంవత్సరం నుంచి ఈ ఆరు గురుకుల కళాశాలల్లో మొదటి ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులు ప్రారంభం కానున్నాయన్నారు. ఒక్కో గ్రూపులో 40 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించనున్నట్లు తెలిపారు. ఒక్కో గురుకుల కళాశాలలో ఎనిమిది అధ్యాపకులను పార్ట్ టైమ్ పద్ధతిలో నియమించనున్నామన్నారు. వారితో ఒక కుక్ ను, ల్యాబ్ అసిస్టెంట్ ను అవుట్ సోర్సింగ్ విధానంలో నియమించనున్నట్లు తెలిపారు. ఆయా గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు కళాశాల ప్రిన్సిపాళ్లగా అప్ గ్రేడ్ చేస్తున్నట్లు మంత్రి సవిత తెలిపారు.

★సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు★

బీసీ బాలికల విద్యకు ప్రోత్సహిస్తూ ఆరు గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేయడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు. ఎంజేపీ గురుకులాల విద్య కోసం విద్యార్థులకు, వారి తల్లిదండ్రుల నుంచి విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. నాణ్యమైన విద్య, భోజనం, వసతి సౌకర్యాలు లభిస్తుండడంతో, రాష్ట్ర వ్యాప్తంగా ఎంజేపీ గురుకులాల్లో విద్యనభ్యసించడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారన్నారు. ప్రజల నుంచి వస్తున్న డిమాండ్ తో పాటు బాలికల విద్యకు వెన్నుదన్నుగా నిలుస్తూ ఆరు ఎంజేపీ స్కూళ్లను అప్ గ్రేడ్ చేసినందుకు సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు. త్వరలో రూ.500 కోట్లతో పది ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించబోతున్నట్లు తెలిపారు.

## రైతు సంక్షేమంలో ఏపీ దేశానికే ఆదర్శం

**అమరావతి, జూన్ 16 (కొత్తస్వరం):**
రాష్ట్రంలో రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, రైతు కుటుంబాల ఆర్థిక భద్రత విషయంలో కూటమి ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు రైతు సమస్యలను వక్రీకరిస్తూ అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. రైతు ఆత్మహత్యలపై తప్పుడు ప్రచారం జరుగుతోందని, గత రెండేళ్లలో త్రిసభ్య కమిటీ పరిశీలనలో 148 కేసులు మాత్రమే నిజమైన రైతు ఆత్మహత్యలుగా నిర్ధారణ అయ్యాయని తెలిపారు. బాధిత కుటుంబాలకు రూ.7 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తున్నామని, ఇప్పటికే 112 కుటుంబాలకు బిల్లులు మంజూరు చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న ధాన్యం బకాయిలు రూ.1,674.47 కోట్లను కూటమి ప్రభుత్వం పూర్తిగా చెల్లించిందని వెల్లడించారు. అలాగే గతంలో మరణించిన 81 మంది రైతుల కుటుంబాలకు రూ.5.67 కోట్ల పరిహారం అందించినట్లు పేర్కొన్నారు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా మామిడి, ఉల్లి, పొగాకు, కోకో రైతులకు మొత్తం రూ.588 కోట్ల సాయం అందించామని మంత్రి తెలిపారు. రైతులు నష్టపోకుండా అవసరమైతే మరిన్ని నిధులు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలోని 22.5 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు రోజుకు 9 గంటలపాటు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, సూక్ష్మసేద్యం అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్–1గా నిలిచిందని చెప్పారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు భారీ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.

## ఫీజుల దోపిడీపై ఏబీవీపీ ఆగ్రహం.. హైదరాబాద్‌లో ఉద్రిక్తత

**ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణకు చట్టం కోరిన విద్యార్థి సంఘం**

**హైదరాబాద్, జూన్ 16 (కొత్తస్వరం):**
ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విచ్చలవిడిగా పెంచుతున్న ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) చేపట్టిన ఆందోళన మంగళవారం హైదరాబాద్‌లో ఉద్రిక్తతకు దారితీసింది. పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ కార్యాలయం ముట్టడికి ప్రయత్నించిన పలువురు కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రావణ్ బి.రాజ్ నేతృత్వంలో కార్యకర్తలు సైఫాబాద్‌లోని కమిషనరేట్ కార్యాలయానికి చేరుకుని ఫీజుల దోపిడీని అరికట్టాలని నినాదాలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని కూడా డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. అనంతరం పలువురు కార్యకర్తలను అదుపులోకి తీసుకుని సమీప పోలీస్ స్టేషన్లకు తరలించారు. 2026–27 విద్యా సంవత్సరానికి అనేక ప్రైవేట్ పాఠశాలలు 20 నుంచి 50 శాతం వరకు ఫీజులు పెంచాయని ఏబీవీపీ ఆరోపించింది. పుస్తకాలు, యూనిఫాంల పేరుతో అదనపు భారం మోపుతూ తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొంది. ఫీజుల నియంత్రణకు కఠిన చట్టం తీసుకురావాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

## సీఎం సహాయ నిధి పేదలకు కొండంత అండ: డాక్టర్ బైరెడ్డి శబరి

**- 19 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ - రూ. 30.60 లక్షల ఆర్థిక సాయం అందజేత**

**బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా**



**నంద్యాల, జూన్ 16 (కొత్త స్వరం):**

ముఖ్యమంత్రి సహాయ నిధి పేద రోగులకు కొండంత అండగా నిలుస్తోందని నంద్యాల ఎంపీ, బైరెడ్డి శబరీ పేర్కొన్నారు. మంగళవారం పాణ్యం నియోజకవర్గం కల్లూరులోని ఎంపీ కార్యాలయంలో నంద్యాల పార్లమెంట్ పరిధికి చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. వివిధ మండలాలకు చెందిన 19 మంది బాధితులకు మొత్తం రూ. 24,60,151 విలువైన చెక్కులు, అదనంగా ముందస్తు అనుమతిగా రూ. 6 లక్షలు కలిపి మొత్తం రూ. 30,60,151 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ, అనారోగ్యం వంటి అత్యవసర పరిస్థితుల్లో పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి గొప్ప భరోసా కల్పిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా కృషి కొనసాగుతుందని తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడుకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఐఐఐటీల్లో పాములపాడు మోడల్ స్కూల్ విద్యార్థుల ఘన విజయం

### 9 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలకు ఎంపిక

### ప్రతిభకు నిదర్శనం: ప్రిన్సిపాల్ వి. నాగ రవీంద్ర

**పాములపాడు, (కొత్త స్వరం):**

పాములపాడు ఏపీ మోడల్ స్కూల్ & జూనియర్ కాలేజ్ 2025–26 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు ఐఐఐటి (ట్రిపుల్ ఐటీ) ప్రవేశాల్లో విశేష ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ వి. నాగ రవీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొత్తం 9 మంది విద్యార్థులు రాష్ట్రంలోని వివిధ రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఐఐఐటి) క్యాంపస్‌లకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు: ఐఐఐటి నూజివీడు – సి.హెచ్. ఎలిజబెత్ రాణి, ఐఐఐటి ఇడుపులపాయ – ఆర్. మహాలక్ష్మి , పి. అక్సా రాణి, ఐఐఐటి ఒంగోలు – సి. మేఘన, కె. జయశ్రీ, ఎం. జ్యోతిక, ఎం. మహేంద్ర, ఎం. శరణ్య, బి. వస్మిత భాయ్. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ విజయం సాధ్యమైందని ప్రిన్సిపాల్ తెలిపారు. ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.




## విద్యుత్ ప్రమాదాలు జరగకముందే ప్రజలను కాపాడండి: సీపీఎం

**పారుమంచాలలో కూలిన విద్యుత్ స్తంభాన్ని పరిశీలించిన ఎం. కర్ణ**



**పారుమంచాల (కొత్త స్వరం):**

విద్యుత్ ప్రమాదాలు జరగకముందే అప్రమత్తమై ప్రజలు, పశువుల ప్రాణాలను కాపాడాలని సీపీఎం మండల కన్వీనర్ ఎం. కర్ణ విద్యుత్ శాఖ అధికారులను కోరారు. మండలంలోని పారుమంచాల గ్రామంలో మంగళవారం నీటిలో పడిపోయిన విద్యుత్ స్తంభాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పారుమంచాల గ్రామంలోని సుంకులమ్మ దేవాలయం ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభం గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా కూలి నీటిలో పడిపోయిందన్నారు. విద్యుత్ తీగలు భూమిపై ఉండటంతో ఎప్పుడైనా ప్రజలు, పశువులకు ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి, ప్రమాదాలు జరగక ముందే ప్రజల ప్రాణాలు, పశువుల ప్రాణాలను రక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దుబాయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మండల టాపర్లకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం



### 24 మంది విద్యార్థులకు నగదు బహుమతులు, మెమెంటోలు ప్రదానం

**నంద్యాల (కొత్త స్వరం):**

నంద్యాల జిల్లాలో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల మండల టాపర్లకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నంద్యాల వాయిస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు ఎన్. మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన అతిథులు విద్యార్థుల భవిష్యత్ కార్యాచరణ, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై మార్గనిర్దేశం చేశారు. ప్రతీ విద్యార్థికి రూ.2,000 నగదు బహుమతి, మెమెంటో, మెడల్‌తో పాటు భగవద్గీత పుస్తకాన్ని అందజేశారు. ఈ పురస్కారాలను ఐసీడీఎస్ పీడీ లీలావతి, డాక్టర్ నెట్ల మహేశ్వర్ రెడ్డి, గొల్ల సుదర్శన్ శెట్టి తదితర ప్రముఖుల చేతుల మీదుగా 24 మంది విద్యార్థులకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థుల అభిప్రాయాలను కూడా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అతిథులు సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎన్. మురళీకృష్ణను, వాయిస్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ హామీలను వెంటనే అమలు చేయాలి: పి. వెంకటేశ్వర్లు



**సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర**

**నందికొట్కూరు (కొత్త స్వరం):**

ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం నందికొట్కూరు పట్టణంలోని వాల్మీకి నగర్, వడ్డేపేట తదితర కాలనీల్లో స్థానిక సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, నందికొట్కూరు మున్సిపాలిటీ ఏర్పడి 13 సంవత్సరాలు అయినా పట్టణ అభివృద్ధిలో పెద్దగా మార్పు లేదన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిన్నదని, వర్షాకాలంలో మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ తాగునీటి పైపుల్లో లీకేజీల కారణంగా ప్రజలు కలుషిత నీరు తాగాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీంతో ప్రైవేట్ నీటిపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. ఇంటి పన్నుల భారం కూడా ప్రజలపై అధికమైందని, వాటిని తగ్గించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలైన ఉచిత కుళాయిలు, ఇంటి పన్నుల తగ్గింపు, ఇల్లు లేని పేదలకు స్థలాలు, గృహనిర్మాణ సహాయం, కొత్త పెన్షన్లు, మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సహాయం వంటి వాగ్దానాలు రెండేళ్లు పూర్తైనా అమలు కాలేదని విమర్శించారు. హామీలు వెంటనే అమలు చేయకపోతే పట్టణ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మహిళా సంఘ ప్రతినిధులు, ఐసా విద్యార్థి సంఘం నాయకులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏటీఎంల వద్ద గట్టి నిఘా

**రాత్రివేళల్లో ప్రత్యేక పర్యవేక్షణ: ఎస్పీ విక్రాంత్ పాటిల్**

**కర్నూలు, జూన్ 16 (కొత్తస్వరం) :**







జిల్లాలోని అన్ని బ్యాంకు ఏటీఎంల వద్ద రాత్రి వేళల్లో గట్టి నిఘా కొనసాగిస్తున్నట్లు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ తెలిపారు. ఇటీవలి కాలంలో ఏటీఎంలలో నగదు చోరీలు, కార్డు స్కిమ్మింగ్, సైబర్ మోసాలు మరియు ఇతర నేర కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ఏటీఎంలను తరచూ తనిఖీ చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. బ్యాంకు నిర్వాహకులు ఏటీఎంల వద్ద సీసీ కెమెరాలు, అలారం వ్యవస్థలు, భద్రతా సిబ్బంది అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఏటీఎంలను ఉపయోగించే సమయంలో తమ పిన్ నంబర్‌ను గోప్యంగా ఉంచుకోవాలని, అపరిచితుల సహాయం తీసుకోకూడదని సూచించారు. ఏవైనా అనుమానాస్పద పరికరాలు లేదా వ్యక్తులు కనిపించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112 / 100కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.


**పాత్రికేయులు కావలెను**

కొత్తస్వరం దినపత్రికకు అనుభవం కలిగిన, వార్తా కథనాలు (స్టోరీలు) రాయగలిగే పాత్రికేయ మిత్రులు కావలెను.

నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాలకు రిపోర్టర్లు అవసరం

నందికొట్కూరు - నందికొట్కూరు రూరల్ - పగిడ్యాల - జూపాడుబంగ్లా - కొత్తపల్లె - పాములపాడు - మిడుతూరు

కొత్తస్వరం 9492813364

కొత్తస్వరం
తెలుగు దిన పత్రిక
కర్నూలు - నంద్యాల
బుధవారం, జూన్ 17, 2026 పేజీ 4

## వీడియో సమావేశంలో పాల్గొన్న నంద్యాల జిల్లా అధికారులు

**- ఆదాయ శాఖ అంశాలపై సమీక్ష - వర్షాకాల పరిస్థితులు, వ్యవసాయ సన్నద్ధతపై చర్చ**
**నీట్ పరీక్ష ఏర్పాట్లపై ప్రధాన కార్యదర్శి దిశానిర్దేశం**




**నంద్యాల, జూన్ 16 (కొత్త స్వరం):** విజయవాడ ప్రధాన కార్యదర్శి శిబిర కార్యాలయం నుంచి సోమవారం ఉదయం నిర్వహించిన వీడియో సమావేశంలో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ సురజ్ ధనుంజయ్ , డీఆర్వో రాము నాయక్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆదాయ శాఖకు సంబంధించిన అంశాలు, ప్రస్తుత వర్షాకాల పరిస్థితులు, వ్యవసాయం మరియు అనుబంధ శాఖల సన్నద్ధత, అలాగే నీట్ పరీక్ష నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమీక్ష నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. అలాగే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ అవసరాలకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఉన్నతాధికారులు, కళాశాల విద్యాశాఖ సంచాలకుడు, వివిధ జిల్లాల కలెక్టర్లు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాలు పచ్చదనంతో కళకళ లాడాలి

**సంక్షేమ పాఠశాలలు , వసతి గృహాలను నెట్ జీరో హెల్తీ క్యాంపస్ లుగా తీర్చిదిద్దడానికి పనులు వేగవంతం చేయండి**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి**






**కర్నూలు , జూన్ 16 (కొత్తస్వరం) :** జిల్లాలోని సంక్షేమ పాఠశాలలు మరియు వసతి గృహాలను నెట్ జీరో హెల్తీ క్యాంపస్ లుగా తీర్చిదిద్దడానికి పనులు వేగవంతం గా సాధించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లో సంక్షేమ పాఠశాలలు , మున్సిపాలిటీ , డ్వామా , రూరల్ వాటర్ సప్లై , డీపీవో , నెట్ జీరో మొదలగు అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి సమావేశం నిర్వహించి సంక్షేమ పాఠశాలలు , వసతి గృహాలను నెట్ జీరో హెల్తీ క్యాంపస్ లుగా తీర్చిదిద్దడానికి పనులు వేగవంతం చేయడానికి వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ.... సంక్షేమ పాఠశాలలు వసతి గృహాలను హెల్తీ క్యాంపస్ లుగా తీర్చిదిద్దడం లో భాగంగా ఆల్ట్రా హైడెన్సిటీ మొక్కలు నాటడానికి గుర్తించిన 10 స్కూళ్లలో వెంటనే పనులు ప్రారంభించి పూర్తిస్థాయిలో మొక్కలు నాటే చర్యలు తీసుకోవాలని , అలాగే రైన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు ఎక్కువమంది సిబ్బందిని ఏర్పాటు చేసుకుని వెంటనే 10 రోజు ల లో ఏర్పాటు చేయాలని అందుకు సంబంధించిన కార్యాచరణ వెంటనే పూర్తి చేయాలని డ్వామా పిడి నరసింహారెడ్డిని ఆదేశించారు. సంక్షేమ వసతి గృహాల అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... పాఠశాలలు , వసతి గృహాలు పచ్చదనంతో కళకళలాడాలని ఆహ్లాదకరమైన వాతావరణం కలిగి ఉండాలని అప్పుడే విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరణం లభిస్తుందని వారు చదువుపై శ్రద్ధ పెట్టగలరని అటువంటి వాతావరణం విద్యార్థులకు అందించే చర్యలు కోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కరించుకోవాలని వాటర్ హార్వెస్టింగ్ పిట్ లు , కిచెన్ వేస్ట్ పిట్ లు , కిచెన్ గార్డెన్ మొదలగునవి ఏర్పాటు చేయటానికి అనుకూలమైన ప్రదేశాలు చూపించి పనులు చేయటానికి సంబంధిత అధికారులతో సహకరించి పనులు పూర్తి చేసే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పిట్ ల వలన ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్త లు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా లోని అన్ని సంక్షేమ పాఠశాలలు , సంక్షేమ వసతి గృహాలలో ఉన్న స్థలం మేరకు తప్పక మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కర్నూలు జిల్లా నేలకు మరియు వాతావరణముకి అనుకూలమైన మొక్కలు తెప్పించి త్వరగా నాటే కార్యక్రమాలు జరిపించాలని నెట్ జీరో కోఆర్డినేటర్లకు సూచించారు. ఈ సమావేశానికి డ్వామా పీడీ నర్సింహారెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి రాధిక , ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సురేష్ ,ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ , కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు , అడిషనల్ కమిషనర్ కృష్ణ , డిపిఓ భాస్కర్ , పబ్లిక్ హెల్త్ ఇంజనీర్, మహాత్మ జ్యోతిబాపూలే మరియు అంబేద్కర్ గురుకుల వసతి గృహాల కోఆర్డినేటర్లు , నెట్ జీరో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కళ్యాణ్ మరియు సంబందించిన సిబ్బంది పాల్గొన్నారు.

## విత్తనాలు, యూరియా సరఫరాపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

**రైతులకు ఎలాంటి కొరత లేకుండా సరఫరా చేయాలని ఆదేశం**

**వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం**

**సాగు సీజన్‌కు ముందస్తు ప్రణాళికపై దృష్టి**

**కర్నూలు, జూన్ 16 (కొత్త స్వరం):** కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విత్తనాలు, యూరియా సరఫరా తదితర వ్యవసాయ అంశాలపై జిల్లా కలెక్టర్ ఏ. సిరి వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు అవసరమైన విత్తనాలు, యూరియా ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో పని చేయాలని సూచించారు. వ్యవసాయ అవసరాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# కర్నూలు నూతన డీఎస్పీకి ఏపీయూడబ్ల్యూజే శుభాకాంక్షలు

**డీఎస్పీ కేవీ రాఘవేంద్రను మర్యాదపూర్వకంగా కలిసిన జర్నలిస్టులు**

**పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు**

**అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ**



**కర్నూలు, జూన్ 16 (కొత్త స్వరం):** కర్నూలు నూతన డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కేవీ రాఘవేంద్ర ను మంగళవారం ఇండియన్ జర్నలిస్టు యూనియన్ సభ్యులు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈ.ఎన్. రాజు, రాష్ట్ర సమితి సభ్యులు వైవీ కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు దస్తగిరి, కార్యవర్గ సభ్యులు మధు తదితరులు డీఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో కర్నూలు ఒకటని, ప్రశాంత వాతావరణంలో సేవలందించే అవకాశం రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం చేపట్టే కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సభ్యులు హుస్సేన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాలలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించిన ఎస్పీ సునీల్ షొరాణ్








**పెండింగ్ కేసులపై సమగ్ర సమీక్ష**
**సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి**
**సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశం**

**నంద్యాల, జూన్ 16 (కొత్త స్వరం):** నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆధ్వర్యంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని ఉపవిభాగాల పోలీసు అధికారులతో వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల పురోగతిని సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల స్థితిగతులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తు పురోగతిపై సంబంధిత అధికారులను ఎస్పీ ప్రశ్నించి కేసు దస్త్రాలను పరిశీలించారు. నిర్ణీత గడువులోపు పెండింగ్ కేసులను పరిష్కార దశకు తీసుకురావాలని ఆదేశించారు. హత్యలు, హత్యాయత్నాలు, మహిళలపై నేరాలు, ఆస్తి సంబంధిత కేసులు, రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. నిందితులు తప్పించుకోకుండా పటిష్ట ఆధారాలు సేకరించి న్యాయస్థానంలో సమర్పించేలా దర్యాప్తు జరపాలని సూచించారు. పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను నేర సమాచార వ్యవస్థలో వెంటనే నమోదు చేయాలని తెలిపారు. హత్య, పోక్సో వంటి కీలక కేసుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. దొంగతనాలు, దోపిడీలు అరికట్టేందుకు ప్రధాన రహదారులపై వాహన తనిఖీలు పెంచాలని, అనుమానితులపై నిఘా ఉంచాలని సూచించారు. అలాగే అక్రమ మద్యం, మట్కా, పేకాట, గంజాయి రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ మోసాలు, రుణ యాప్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, నేర నియంత్రణలో ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ యగంధర్ బాబు, ఉపవిభాగాధికారులు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.





## కర్నూలులో అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

**5.50 లక్షల మందితో యోగాంధ్ర విజయవంతమే లక్ష్యం**
**11,500 మంది మాస్టర్ శిక్షకులకు ప్రత్యేక శిక్షణ**
**జిల్లావ్యాప్తంగా యోగా కార్యక్రమాలు జోరుగా కొనసాగింపు**

**కర్నూలు, జూన్ 16 (కొత్త స్వరం):** కర్నూలు జిల్లాలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని సెట్కూరు సీఈవో వేణుగోపాల్ తెలిపారు. జిల్లాలో 5 లక్షల 50 వేల మందితో యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే లక్ష్యమన్నారు. మంగళవారం కర్నూలు నగర శివారులోని శ్రీ రూపాల సంగమేశ్వర స్వామి టెంపుల్ ప్రాంగణంలో ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ, జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 11,500 మంది యోగా శిక్షకులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని, వారు ప్రజలకు యోగా సాధనపై మార్గనిర్దేశం చేస్తున్నారని చెప్పారు. పర్యాటక యోగా కార్యక్రమాల్లో భాగంగా రాక్ గార్డెన్, కొండారెడ్డి ఫోర్ట్ వంటి ప్రదేశాల్లో కూడా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని వివరించారు. అలాగే మంత్రాలయం సహా పలు పుణ్యక్షేత్రాల్లో యోగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ నెల 18న ఎస్‌టీబీసీ మైదానంలో వెయ్యి మంది పారిశుద్ధ్య కార్మికులతో ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. యోగాపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛతా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**

**కర్నూలు, జూన్ 16 (కొత్తస్వరం) :** జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛతా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమ నిర్వహణపై మున్సిపల్ కమిషనర్లు, డీపీవో తదితరులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కార్పొరేషన్, మున్సిపాలిటీలు, గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం కింద పారిశుధ్య పనులు నిర్దేశిత విధంగా జరగాలని సూచించారు. ఈ వారం పబ్లిక్ టాయిలెట్లు, చెత్త కుప్పల తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వ్యర్థాలు ఉత్పత్తి చేసే సంస్థలు తమ వద్దే వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. గ్రామాల్లో స్వచ్ఛ పథం కింద స్వచ్ఛ రథాల ద్వారా చెత్త సేకరణ, తడి–పొడి చెత్త వేరు చేయడం, రోడ్ల శుభ్రత, రీసైక్లింగ్ విధానాలపై డీపీవో భాస్కర్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వీధులు, ప్రధాన రహదారుల పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించి, మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. వ్యర్థాల విభజనపై ప్రజల్లో అవగాహన పెంచాలని, అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలు పారిశుధ్యం–పరిశుభ్రతలో మెరుగైన పనితీరు కనబర్చి ప్రజలకు మంచి సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో మెరుగైన ర్యాంకులు సాధించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, అడిషనల్ కమిషనర్ కృష్ణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ రఘు, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మిగనూరు, ఆదోని, గూడూరు మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు.

Edited, Printed, Published by **KEDEM RAVI RAJU,** Printed at 3-151, DAMAGATLA NANDIKOTKURU, KURNOOL, ANDHRA PRADESH - 518432, **VSAR PUBLICATIONS,** 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL, ANDHRA PRADESH - 518006, A.P., Editor : **KEDEM RAVI RAJU**, Cell No. 9912213364, Email:kothaswaram2024@gmail.com, **PRGI No. APTEL/2010/31893**, WebSite : www.kothaswaram.com